గురువారం 15 మే 2025 5


శ్రీ సత్యసాయి





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్





రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యలో తీసుకొస్తున్న సంస్కరణలు పేద విద్యార్థులకు నష్టం చేకూర్చే విధంగా ఉండబోతున్నాయన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పునర్ వ్యవస్థీకరణతో విద్య వ్యవస్థ మొత్తం గందరగోళంలో పడే పరిస్థితులు నెలకొనబోతున్నట్టు విద్యావేత్తల్లో

అయోమయంలో పాఠశాల విద్య..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



పాఠశాల పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం మూడు జీవోలను జారీ చేసింది. వీటిని నిసితంగా గమనిస్తే ఇప్పుడున్న విధానం కాకుండా మార్పులతో అయోమయం కూడా నెలకొనే పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఆరు రకాలుగానున్న దాన్ని తొమ్మిదికి పెంచామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా ఈ మార్పులతో ఉపాధ్యాయ పోస్టులను మిగులు చూపించే ప్రయత్నం సాగుతోందన్న విమర్శలూ ఉన్నాయి.

విద్యా వ్యవస్థలో మార్పులు ఇలా...

అంగన్‌వాడీ మొదటి రెండు సంవత్సరాలున్న పాఠశాలను శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్ అని, అంగన్‌వాడీ రెండు సంవత్సరాలు 1, 2 తరగతులను ఫౌండేషన్ స్కూల్ అని పేరు పెట్టారు. అంగన్‌వాడీ రెండు సంవత్సరాలతోపాటు ఒకటి నుంచి ఐదవ తరగతి వరకుండే పాఠశాలను బేసిక్ ప్రైమరీ స్కూల్ అని పేరు పెట్టారు. అంగన్‌వాడీ రెండు సంవత్సరాలతోపాటు ఐదవ తరగతి వరకు ఉంటూ 60 మంది కంటే విద్యార్థులు ఎక్కువ ఉంటే మోడల్ ప్రైమరీ స్కూల్ అని నామకరణం చేశారు. అంగన్‌వాడీ రెండు సంవత్సరాలు 1 నుంచి 8వ తరగతి వరకు ఉండే పాఠశాలను అప్పర్ ప్రైమరీ పాఠశాల అంటారు. ఆరు నుంచి పదవ తరగతి వరకుండే పాఠశాలలను హైస్కూల్‌గా నామకరణం చేశారు. 1 నుంచి 10 వరకున్న పాఠశాలలు హైస్కూల్ అయినప్పటికీ సిబ్బంది కేటాయింపు వేరుగా ఉంటుంది. ఆ తరువాత 6 నుంచి 11, 12 తరగతులుంటాయి. వీటిని హైస్కూల్ ప్లస్ అంటారు. మరో దగ్గర 1 నుంచి 11, 12 తరగతుల వరకుండే వాటిని కూడా హైస్కూల్ ప్లస్ అనే అంటారు. మొత్తం తొమ్మిది రకాలుగా పాఠశాలల గుర్తించారు. వీటి ఆధారంగా ఉపాధ్యాయ నియామకాలు సర్దుబాటు చేయనున్నారు. ఈ సర్దుబాటుల్లో స్కూల్ అసిస్టెంట్లు మిగులు వస్తున్నారు. ఈ మిగులు వచ్చిన స్కూల్ అసిస్టెంట్లను ప్రైమైరీ స్కూల్ హెడ్‌మాస్టర్లుగా మార్చనున్నారు. ఈ మార్చడం వల్ల సబ్జెక్టు టీచర్లు ప్రాథమిక విద్యను బోధించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈ రకంగా అనంతపురం జిల్లాలో 515 స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులుగా పోవాల్సి ఉంటోంది. ఇవిపోను మరో 437 మంది ఇప్పటి వరకు డిఇఒ పూల్‌లో ఉండగా వారిని రాష్ట్ర హెచ్‌ఒడి పూల్‌లో మారుస్తారు. అక్కడి వారి మార్గదర్శకాల ప్రకారం ఈ ఉపాధ్యాయులు వెళ్లి బోధన చేయాల్సి ఉంటుంది. 1 నుంచి 10 వరకు, 1 నుంచి 12వ తరగతి వరకు కూడా కొన్ని పాఠశాలలు పెడితే విద్యాబోధనలోనూ ఇబ్బందులు తప్పవన్న అభిప్రాయాన్ని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు చెబుతున్నారు. కొత్త విధానంతో గందరగోళం, అయోమయం విద్యా వ్యవస్థలో నెలకొనడమే కాకుండా పేద విద్యార్థులకు నష్టం చేకూరేది ఉండనుందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

- పునర్‌వ్యవస్థీకరణతో సమస్యలు
- పేదలకు దూరం కానున్న ప్రభుత్వ విద్య
- కొత్త నిబంధనలపై సర్వత్రా విమర్శలు

పునర్ వ్యవస్థీకరణతో అయోమయం

ప్రభుత్వం తీసుకొచ్చిన పాఠశాలల పునర్ వ్యవస్థీకరణతో విద్యా వ్యస్థలో గందరగోళం నెలకొనే అవకాశముంది. విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టుల కేటాయింపులోనూ సమస్యలొచ్చే అవకాశముంది. అప్పర్ ప్రైమరీలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉంటే స్కూల్ అసిస్టెంట్లను నలుగురినే నియమిస్తారు. అప్పుడు రెండు సబ్జెక్టులకు విద్యను ఎవరు బోధిస్తారన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ప్లస్2ను కలిపి స్కూల్ అసిస్టెంట్లుగానున్న వారిని బోధించమని చెబుతున్నారు. వారు రెగ్యులర్ కాకపోవడం వల్ల ఏ మేరకు విద్యార్థులకు సరైన విద్య అందుతుందన్నది కూడా ప్రశ్నార్థకంగానే ఉంది. ప్రభుత్వం ఈ నిర్ణయాలను పనర్ పరిశీలిస్తే బాగుంటుంది.

రమణయ్య, యుటిఎఫ్ నాయకులు.

పేద విద్యార్థులకు నష్టం

పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ వల్ల పేద విద్యార్థులకు తీరని నష్టం జరిగే అవకాశం కనిపిస్తోంది. తక్కువ విద్యార్థులున్నారని కొన్నింటినీ విలీనం చేస్తున్నారు. ముందున్న పాఠశాలకు ఇప్పుడు వీలినం చేయబోయే పాఠశాలలకు మధ్య దూరం ఎక్కువగా ఉంటోంది. దీని వలన ప్రాథమిక విద్య అభ్యసించే వారికి ఇబ్బందులు తప్పవు. క్రమంగా విద్యకు దూరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకటి నుంచి 12 వరకు కూడా కొన్నింటిని కలిపి ఉంచే ఆలోచన ఉంది. అలా చేస్తే అంతమంది విద్యార్థులు ఒకేచోట అవడంతోనూ విద్య బోధనలోనూ గందరగోళం నెలకొనే అవకాశముంది.

పరమేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి, అనంతపురం.

బ్యాంకర్ల భాగస్వామ్యంతో అభివృద్ధి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

బ్యాంకు అధికారులు అభివృద్ధిలో భాగస్వాములై జిల్లాలో స్థిరమైన అభివద్ధికి కషి చేద్దామని కలెక్టర్ టిఎస్.చేతన్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో లక్ష సాధన ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని అర్హులైన రైతులు, చేనేతలు, ఎస్సీ, ఎస్టీ, వర్గాల వారికి విరివిగా రుణాలు అందించాలన్నారు. అర్హులైన వారికి స్టాండప్ ఇండియా, పీఎం ఈజిపి కింద రుణాలు అందించాలన్నారు. ప్రజాప్రతినిధులు, ఆర్డీవోలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మెప్మా, బ్యాంకు అధికారులు సమన్వయంతో పీఎం సూర్యఘర్‌పై ప్రజల నుంచి విరివిగా దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ రమణకుమార్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా మొత్తం రుణాలు రూ.11,870 కోట్లు లక్ష్యం కాగా రూ.14,168 కోట్ల రుణాలు గత ఆర్థిక సంవత్సరంలో మంజూరు అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ ప్రతినిధి రోహిత్, గంగాధర్, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు, పలువురు జిల్లా అధికారులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

17న స్వర్ణాంధ్ర స్వచ్ఛంద ఏర్పాట్ల సమీక్ష

ఈనెల 17న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులతో కలెక్టరేట్లో సమీక్షించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర యాప్‌లపై జిల్లాలోని అన్ని శాఖల హెచ్ఒడిలు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపిఒ సమత, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా వేసవిలో వలగాల్పుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు ప్రజలకు వివరించాలన్నారు. కరపత్రాల ద్వారా శనివారం ప్రజలకు ఈ విషయాలపై తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో, పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

లోకేష్ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

మూడు రోజుల పాటు అనంత జిల్లాలో మంత్రి

ప్రజాశక్తి-అనంతపురం



రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం నుంచి మూడు రోజుల పాటు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. 15, 16, 17వ తేదీల్లో ఆయన పర్యటన సాగనుంది. 15న సాయంత్రం రామరాజుపల్లిలో టీడీపీ కార్యకర్తలతో సమావేశం కానున్నారు. 16న ఉదయం బేతపల్లిలోని రెన్యూ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం అనంతపురంలో జరిగే కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కుమార్తె వివాహానికి హాజరుకానున్నారు. 17న ఉదయం జెఎన్‌టియు 14వ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి కలిసి పాల్గొంటారు. గురువారం నాడు బేతాపల్లిలో హెలిప్యాడ్, సభా వేదిక, రెన్యూ విండ్ ఎనర్జీ (జెఎంబి) ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ బుధవారం పరిశీలించారు. మంత్రి పర్యటనకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మంత్రి పర్యటించనున్న ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

పుట్టపర్తిని పర్యాటకంగా అభివృద్ధి చేయండి : ఎమ్మెల్యే



చిత్రావతి పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వాణిజ్య సంస్థల సామాజిక బాధ్యత నిధి ద్వారా పుట్టపర్తిని పర్యాటకంగా మరింత అభివృద్ధి పరిచేలా పనులు చేపట్టాలని ప్రముఖ కంపెనీలను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు. జాయ్ లూక్కాస్ కంపెనీ ప్రతినిధులు బుధవారం పుట్టపర్తి లోని పలు పర్యాటక ప్రదేశాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో కలసి పర్యటించారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 100 వ శత జయంతోత్సవాల సందర్భంగా పలు అభివృద్ధి పనులకు తగిన చేయుతనివ్వాలని పలు కార్పొరేట్ సంస్థలను ఆమె కోరారు. ఈ సందర్భంగా పుట్టపర్తి మున్సిపల్ పరిధిలోని శిల్పారామం పుడా పరిధిలో ఉన్న పార్కు స్థలాన్ని, చిత్రావతి పరివాహక ప్రాంతం ఆంజనేయస్వామి విగ్రహం, తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యేతో పాటు ప్రముఖ జాయ్ లుక్కాస్ జ్యువెలరీ కంపెనీ ప్రతినిధులు జాయ్ లూకాస్, రోబిన్ ,మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, ప్రభుత్వ అధికారులు, పర్యాటక అధికారి నర్సయ్య ,స్థానిక ప్రజాప్రతినిధులు,టీడీపీ నాయకులతో పాటు పరిశీలించారు. పుట్టపర్తినికార్పొరేట్ సోషియల్ రెస్పాన్స్ బ్యూలిటి నిధులతో అభివృద్ధి చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జాయ్ లూకాస్ జ్యువెలరీ ప్రతినిధులను కోరారు. అదే విధంగా పుడా పరిధిలో ఉన్న 14 పార్కుల అభివృద్ధికి తగిన తోడ్పాటు నివ్వాలని విన్నవించారు. పుట్టపర్తి శిల్పారామంలో తగిన మౌలిక వసతుల కల్పనకు తగిన సహకారం ఇవ్వాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ టీ ఎస్ చేతన్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తోపాటు జాయ్ లూకాస్ జ్యువెలరీ కంపెనీ ప్రతినిధులు జాయ్ లూకాస్ , రిబిన్‌తో కలసి అభివృద్ధి పనులపై చర్చించారు. తమ కంపెనీ ద్వారా పుట్టపర్తి పర్యాటక రంగ అభివృద్ధికి తగిన నిధులు ఇచ్చి సహాయ సహకారాలు అందిస్తామని ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

స్నాతకోత్సవాన్ని పండుగలా నిర్వహిద్దాం

జెఎన్‌టియు వైస్-ఛాన్సలర్ హెచ్.సుదర్శన రావు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు 14వ స్నాతకోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వాహిద్దామని జెఎన్‌టియు వైస్‌ఛాన్సలర్ హెచ్.సుదర్శన రావు తెలియజేశారు. స్నాతకోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం నాడు జెఎన్‌టియు ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలులో యూనివర్సిటీలోని వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ 17వ తేదీన నిర్వహించే స్నాతకోత్సవ వేడుకలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఛాన్సలర్ హోదాలో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. డాక్టర్ సత్యనారాయణ చావాకు వర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాన్పూర్ ఐఐటి రిటైర్డ్ ఆచార్యులు ఎంఆర్.మాధవ్ హాజరవుతారన్నారు. స్నాతకోత్సవం నిర్వహణకు సంబంధించి ఇప్పటికే కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. వారి పరిధిలోని పనులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి స్థాయిలో నిర్వహించాలని తెలియజేశారు. విద్యార్థులు 17వ తేదీ ఉదయం 9.30 గంటలలోపు ఎన్‌టిఆర్ ఆడిటోరియానికి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య, ఓస్‌డి టు వీసీ ఎన్.దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు పిఆర్.భానుమూర్తి, ఎస్‌వి.సత్యనారాయణ, వైశాలి ఘోర్పడే, పి.సుజాత, జి.ప్రశాంతి, పద్మ సువర్ణ, ఆర్.కిరణ్మయి, నాగ ప్రసాద్ నాయుడు, ఎ.సురేష్ బాబు, బి.ఈశ్వర్ రెడ్డి, విబి.చిత్ర, సి.శోభా బిందు, జివి.సుబ్బారెడ్డి, ఎపి.శివ కుమార్, ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, చంద్ర మోహన్ రెడ్డి, కోఆర్డినేటర్స్ డా॥అరుణ మస్తాని పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి సుదర్శనరావు


పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పదవ తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిఆర్ఒ విజయ సారధి అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై ముందస్తు ఏర్పాట్లపై డిఆర్ఒ విద్యాశాఖ అధికారులతో బుధవారం కలెక్టరేట్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 24 వరకు పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. మొత్తం 7056 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు సజావుగా పరీక్షల నిర్వహణకు తకు చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ కిష్టప్ప, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కదిరిలో మిస్టర్ ఆంధ్ర క్లాసిక్ బాడీ బిల్డింగ్ పోటీలు

ప్రజాశక్తి - కదిరి టౌన్



బాడీ బిల్డింగ్ పోటీలు

పట్టణంలోని పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో మిస్టర్ ఆంధ్ర క్లాసిక్ బాడీ బిల్డింగ్ పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుండి అధిక సంఖ్యలో బాడీ బిల్డర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ కదిరి ప్రాంతంలో మొట్టమొదటిసారిగా బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించడం హర్షణీయమని అన్నారు. ఈ పోగ్రాం చేయడం పట్ల నిర్వాహకులు రమేష్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఐబీబీ ఎఫ్ (ఇండియన్ బాడీ బాడీ బిల్డర్స్ అసోసియేషన్) ద్వారా రాష్ట్ర అసోసియేషన్ ద్వారా అనుమతి కోరి కదిరి ప్రాంతానికి ఈ అవకాశం కలిగించాలని ఐబీపీఎఫ్ అధ్యక్షులు స్వామి రమేష్, శ్రీనివాసరాజు కోరడంతో ఈ అవకాశం వచ్చిందన్నారు. ఈ పోటీల నిర్వహణకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఎంతో సహకరించారన్నారు. అనంతరం 11 కేటగిరీలు జరిగిన ఈ పోటీల్లో ప్రతి క్యాటగిరిలో మొదటి స్థానంలో నిలిచిన వారిని తీసుకొని మరొకసారి ఆ 11 మంది మధ్య ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్స్ పోటీ నిర్వహించారు. ఓపెన్ బాడీ బిల్డింగ్ మొదటి స్థానంలో సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన శివాజీ నిలిచారు. విజేతకు 50 వేల రూపాయలు బహుమతి ట్రోఫీతో పాటు మెడల్ అందజేశారు. రెండవ స్థానంలో నిలిచిన బాడీ బిల్డర్‌కు పదివేల బహుమతిని అందజేశారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ధర్నాలో వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి రొద్దం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కూలీలు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని బుధవారం లోచర్ల సచివాలయం ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వ్యకాసం నాయకులు మాట్లాడుతూ మండలంలోని లోచర్ల , కొత్తూరు గ్రామాల ఉపాధి కూలీలకు బకాయి ఉన్న వేతనాలు, పే స్లిప్పులు , పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు..ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలు తగదు'

ప్రజాశక్తి-హిందూపురం

రెండు రోజుల క్రితం లేపాక్షి మండలం కోడిపల్లి గ్రామానికి బాబా ఫకృద్దీన్ దంపతులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, గ్రామంలో జరిగిన చిన్న పాటి ఘర్షణకు ప్రతి పక్ష పార్టీ మెప్పు కోసం రాజకీయ రంగు పూస్తున్నారని ఆగ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు మాజీ సర్పంచి నాగరాజు, గ్రామస్తులు శ్రీకంత్, అరవింద్, శివమ్మ తదితరులు బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నాలుగు నెలల క్రితం బాబా ఫక్రోద్దీన్ కుమారుడు దాదా ఖలందర్ అదే గ్రామానికి చెందిన నాగరాజు కుమార్తె (22)ను ప్రేమ పేరుతో తీసుకెళ్లాడన్నారు. ఈ విషయం తెలిసి గ్రామస్తులు అందరు కలిసి వారిని తీసుకోచ్చి ఇరు కుటుంబాలను నచ్చజెప్పి ఊరికి తీసుకోచ్చి ఎవరెంటికి వారిని పంపామన్నారు. దీనిపై వారు కక్ష కట్టుకుని లేని ఆరోపణలను చేయడంతో పాటు గ్రామంలో నివాసం లేని వారి పేర్లు సైతం ఫిర్యాదులో చేర్చారన్నారు. గ్రామంలో ఏలాంటి గొడవలు జరిగిన బాబా ఫక్రోద్దీన కుమారులు ముందు ఉంటారన్నారు.. ఇప్పటికే వారిపై లేపాక్షి పోలీస్ స్టేషన్ లో పలు కేసులు ఉన్నాయన్నారు. ఇప్పటికే పలు మార్లు పోలీసులు బాబా ఫక్రోద్దీన్ కుమారులకు బైండొవర్ చేశారన్నారు. వారి గొడవలకు గ్రామస్తులకు ఏలాంటి సంబందం లేదన్నారు. ఈ సమావేశంలో గ్రామస్తులు బాబురెడ్డి, గంగాధర్, లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల గ్రామసభ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం మండల పరిధిలోని మల్లాకాల్వ గ్రామంలో బుధవారం ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బంది కలసి గ్రామసభను ఏర్పాటు చేశారు. ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ పోలీసు, పంచాయతీ కార్యదర్శి, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు,

పట్టణాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జులతో కలిసి హిందూపురం పట్టణ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేయాలని బాలయ్య పీఏ వీరయ్య అమ్యూనిటీ సెక్రెటరీలకు ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్ లో మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, కమిషనర్ సంగం శ్రీనివాసులతో కలిసి మున్సిపల్ ఇంజనీర్లు, అమ్యూనిటీ సెక్రెటరీలతో పట్టణాభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతు హిందూపురం పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో రూ. 92.50 కోట్లు నిధులు మంజూరు అయ్యాయన్నారు. మున్సిపల్ ఇంజనీర్లు, అమ్యూనిటీ సెక్రటరీలు, వార్డు ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఆయా వార్డుల్లో ప్రజలకు అవసరమైన రహదారులు, మురుగు కాలువలు ఇతర అభివృద్ధికి సంబంధించిన నివేదికలను సిద్ధం చేయాలన్నారు. రెండు రోజుల్లో సిద్ధం చేసి అందించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్, డిఇలు వాణి, ఆనందరాజు, ఏఈలు జనార్ధన్, శంకర్, ధీరజ్, ఆయా సచివాలయాల అమ్యూనిటీ సెక్రటరీలు పాల్గొన్నారు.



అమ్యూనిటీ సెక్రటరీలతో సమీక్షిస్తున్న బాలయ్య పిఏ వీరయ్య



ఏర్పాటు చేసిన ప్రమాద సూచికలు

ప్రమాద సూచికలు ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని పెనుగొండ మడకశిర ప్రధాన రహదారిలో మండలంలోని రోప్పల పెద్దమంతురు గ్రామాల మధ్యలో చేపడుతున్న కాల్వర్ట్ పనుల వద్ద ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశంలో సూచికలు ఏర్పాటు చేయకపోవటంతో వాహనదారుల ఇబ్బందుల గురించి ప్రజాశక్తి దినపత్రికలో ఇటీవల కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కాంట్రాక్టర్లు వెంటనే రోడ్డుకు ఇరువైపున కట్టెలు పాతి సూచికలు ఏర్పాటు చేశారు. దీంతో పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

'ఉపాధి'పై సమీక్ష

ప్రజాశక్తి - సోమందేపల్లి

స్థానిక మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఉపాధి సిబ్బందిపై సమీక్షా సమావేశాన్ని నూతన ఎంపీడీవో వెంకటలక్ష్మి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ కూలీల సంఖ్య ఎంచాలన్నారు. కనీస వేతనం 300 రూపాయలకు తక్కువ కాకుండా ఉపాధి కూలీలతో పని చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది సోమశేఖర్ రెడ్డి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలో జరుగుతున్న ప్రత్యేక అవసరాల పిల్లల సర్వేను జిల్లా సాహితీ సమన్వయకర్త ఆనంద్ బాబు బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలపై డోర్ టు డోర్ వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి సంబంధిత పాఠశాలలో చేర్పే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

19న ఎంపీపీ ఎన్నిక

ప్రజాశక్తి - గాండ్లపెంట

ఈనెల 19న ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు చేయగా కోరం లేక ఎన్నిక వాయిదా పడిందన్నారు. తిరిగి కలెక్టర్ ఉత్తర్వులు మేరకు ఈనెల 19వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

శక్తి యాప్‌పై జిల్లా వ్యాప్తంగామహిళలకు బాలికలకు విస్తతంగా అవగాహన కార్యక్రమాలను కల్పిస్తున్నట్లు జిల్లాలో శక్తి టీం బృందాలు తెలిపాయి. బుధవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళా డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో పుట్టపర్తి లోని శక్తి టీం బృందాలు అంగనవాడి వర్కర్లకు, మహిళలు, విద్యార్థినులకు అవగాహన కల్పించాయి.

రిటైర్డ్ డిఇఒ ఆనందమూర్తి కన్నుమూత



అనంతపురం : రిటైర్డ్ డిఇఒ ఎస్.ఆనంద మూర్తి(75) బుధవారం అనారోగ్యంతో కన్ను మూశారు. ఈయన శెట్టూరు మండలంలోని ములకలేడు గ్రామంలో 1949లో నిరుపేద దళిత కుటుంబంలో జన్మించారు. ఉన్నత విద్యనభ్యసించిన ఆయన ఉద్యోగరీత్యా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో లెక్చరర్‌గా, ప్రొఫెసర్‌గా, జడ్పీ సిఇఒగా, జిల్లా విద్యాశాఖ అధికారిగా అనంతపురం జిల్లాలో పని చేసి చివరగా విజయనగరం జిల్లాలో ఉద్యోగ విరమణ పొందారు. ఆయన అంత్యక్రియలు గురువారం ములకలేడు గ్రామంలో నిర్వహిస్తామని కుమారులు మల్లికార్జున, బాలు, వివేక్ తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



ధర్మవరంలో సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు


నంబులపూలకుంటలో బుక్‌లెట్ విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు సిఐటియు ధర్మవరం నాయకులు జె వి రమణ ఆధ్వర్యంలో బుధవారం అంగన్వాడి లీడర్ చంద్రకళ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘం నాయకులు బొగ్గు నాగరాజు, జయ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు అనిల్, దస్తగిరి, మారెప్ప, కాటమయ్య, పెద్దన్న, అంగన్వాడీలు చింతమ్మ, సరస్వతి, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెనోటీలు అందజేత : ఈ నెల 20 తేదీ సిఐటియు ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరగబోయే సమ్మెను జయప్రదం కోసం సహకరించాలని బుధవారం సమ్మె నోటీసులను పలు పోరాట సంఘాలను కలసి అందజేశారు. ధర్మవరం పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్, ఎస్‌బిఐ, ధర్మవరం తహశీల్దార్ తదితరులకు సమ్మె నోటీసును అందజేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు జెవి రమణ ,టి. అయుబ్ ఖాన్, ఎల్. ఆదినారాయణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నామాల నాగార్జున, పోస్టల్ డిపార్ట్మెంట్ నాయకులు ఆంజనేయులు, వీఆర్ఏ సంఘం నాయకులు ఆంజనేయులు, ఆదినారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట :కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సిపిఎం మండల నాయకులు విమర్శించారు. ఈ మేరకు సిపిఎం నాయకులు బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు,కార్మికులకు సమానవేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిల్డింగ్, స్కీమ్ వర్కర్లకు, అసంఘటిత రంగ కార్మికులందరికీ ఇఎస్ఐ అమలుచేయాలన్నారు. బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కోరారు. వారికి కనీస పెన్షన్ పది వేల రూపాయలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధికారి కె కె రాజారెడ్డి, జిల్లా రైతు సంఘం కార్యవర్గ సభ్యులు నాగిరెడ్డి, గంగిరెడ్డి, సిఐటియు నాయకులు నాగరాజు, మల్లిరెడ్డి, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం మండల నాయకులు గోవిందు కోరారు. పంచాయతీ, అంగన్వాడీ, ఆశావర్కర్లు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మల్లికార్జున, రామయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మే 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు, వ్యకాసం నాయకులు కోరారు. ఈ మేరకు వారు సమ్మెకు సంబందించిన బుక్‌లెట్‌ను బుధవారం ఇతర కార్మిక సంఘాలతో కలిసి డుదల చేశారు.

ఈసందర్భంగా సిఐటియు మండల నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ 20 తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, గౌస్, ఆశ వర్కర్లు శోభ, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో ఎన్జీవో భవనంలో ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు యాకుబ్ ఖాన్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు మాబున్నీసా, సువర్ణ, హేమలత, సుజాత ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాసులు, ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్‌కార్మిక సంఘం నాయకులు శంకర్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు తిరుపాల్, జనార్ధన్, బాలకృష్ణ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఔట్‌సోర్సింగ్ కార్మిక సంఘం నాయకులు రామ్మోహన్, పద్మావతి, ఫాతిమా సిఐటియు నాయకులు జి.ఎల్. నరసింహులు, బాబ్జాన్, ముస్తాక్, రఫీ, ఉదయ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న చేపట్టిన సమ్మెలో అన్ని రంగాల ఉద్యోగ,కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


చిలమత్తూరులో బుక్‌లెట్ విడుదల చేస్తున్న నాయకులు


కదిరిలో రౌండ్‌టేబుల్ సమావేశం

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఎం ఆర్ డి ఎస్ సరోజమ్మ కళా బృందంతో వీధి నాటకం ద్వారా హెచ్.ఐ.వి,ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని ఓబులదేవ చెరువు పోలీసు స్టేషన్ సమీపంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమములో మెడికల్ ఆఫీసర్ భాను ప్రకాష్, వైద్య సిబ్బంది, జన జాగృతి పియుకదిరి ప్రాజెక్ట్ మేనేజర్ ఇ శ్రీనివాసులు, ఎఒఆర్‌డబ్ల్యు శిల్ప, శ్రీవాణి, నిర్మల, పిఇలు ప్రసన్న, నారాయణమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసిపి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులుగా కుంటాల పుల్లయ్య

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన సర్పంచి కుంటాల పుల్లయ్యను వైసిపి నియోజకవర్గ బిసిసెల్ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. తన ఎంపికకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి, తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలసి వెళ్లి వెంకటరామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఆరవేటి కాటమయ్య, కన్వీనర్ ఆరవేటి రామాంజనేయులు, పెద్దిరాజు, గురుప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మున్సిపల్ చైర్మన్ కన్నుమూత

ప్రజాశక్తి - కదిరి టౌన్


ముజఫర్ అలీ (ఫైల్‌ఫొటో)

మాజీ మంత్రి నిజాంవలి తనయుడు, కదిరి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్ఎం ముజఫర్ అలీ కన్నుమూసారు. అనారోగ్యంతో హైదరాబాద్ లో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ముజఫర్ అలీ 1982 – 92 మధ్య కాలంలో మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన హయాంలో పట్టణాభివృద్ధికి కషి చేశారు. అలాగే ఎంతో మంది కార్మికులను డైలీ ప్రాతిపదికన విధుల్లోకి తీసుకున్నారు. ముజఫర్ అలీ అనారోగ్యంతో బాధపడుతు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆయన నివాసానికి చేరుకొని నివాళులు అర్పించారు. ఆయనతో పాటు పలువురు నేతలు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పార్టీ బలోపేతానికి పనిచేయండి

ప్రజాశక్తి - కొత్త చెరువు

ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర కోరారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలసి కొత్తచెరువు మండల టిడిపి నాయకులు కార్యకర్తలతో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీకి పనిచేయని వారిని పదవులకు దూరంగా పెడతామని తెలిపారు. పార్టీకికష్టపడిన కార్యకర్తలకే తగిన గుర్తింపును ఇస్తామన్నారు. టిడిపిలో గ్రూపు రాజకీయాలకు తావు లేదన్నారు. గ్రామాల్లో చిన్నచిన్న విభేదాలు ఉంటే కుటుంబ సభ్యుల్లా కలిసికట్టుగా కూర్చొని పరిష్కరించుకుందామని తెలిపారు. గత ఎన్నికల్లో టిడిపికి వచ్చిన మెజార్టీపై పంచాయతీల వారీగా పోలింగ్ బూత్ లో వచ్చిన ఓట్ల సంఖ్యను కార్యకర్తల దృష్టికి తీసుకొచ్చారు. తెలుగుదేశం పార్టీకి నష్టం కలిగిస్తే ఉపేక్షించే తసక్తే లేదని హెచ్చరించారు. మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. ఈ సమావేశంలో కొత్తచెరువు మండల కన్వీనర్లు శ్రీనివాసులు రామకృష్ణ టిడిపి సీనియర్ నాయకులు శ్రీనివాసులు, ఎల్ఐసి నరసింహులు, టిడిపి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన గాండ్లపెంట ఇన్‌ఛార్జి ఎంపిపి



గంగోజమ్మను టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

స్థానిక ఎమ్మెల్యే కందికుంట సమక్షంలో గాండ్లపెంట ఇన్‌ఛార్జి ఎంపీపీ గంగోజమ్మ వైసీపీ వీడి టిడిపిలో చేరారు. గాండ్ల పెంట ఎంపీపీ ఎన్నికకు ముందు వైసీపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. వైసీపీకి చెందిన గాండ్లపెంట ఇంచార్జ్ ఎంపీపీ గంగోజమ్మ ఆ పార్టీనీ వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గంగోజమ్మ కి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ ఈనెల 19న జరిగే ఎంపీపీ ఎన్నికకు సంబంధించి గాండ్లపెంట టీడీపీ అభ్యర్థిగా సోమశేఖర్ రెడ్డిని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. వైసిపి పార్టీ విధానాల పట్ల విసిగి చెందిన సొంత పార్టీ నాయకులు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి టిడిపిలో చేరుతున్నారన్నారు. అందులో భాగంగా గాండ్లపెంట ఇంచార్జ్ ఎంపీపీ గంగోజమ్మ టిడిపిలోకి రావడం హర్షణీయమని అన్నారు . తమపై విశ్వాసంతో పార్టీలోకి చేరిన గంగోజమ్మ కి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు . ఈ కార్యక్రమంలో ఎంపీపీ అభ్యర్థి సోమశేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, టిడిపి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిబిఎస్ఇ ఫలితాల్లో జైన్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్

సీబీఎస్ఈ పదవ తరగతి పరీక్ష ఫలితాలలో పట్టణంలోని జైన్ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. భవిత 462, షగుఫ్తా సుల్తానా454, సారా కౌసర్ 446, హర్షద్ 438, లాస్యప్రియ 435, సాధించారు. పాఠశాల విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించారు. మొదటి సంవత్సరం లోనే ఇంతటి ఫలితాలను అందించిన విద్యార్థులకు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఉమామహేశ్వర్, పాఠశాల సిఇఒ సాగర్ అభినందనలు తెలిపారు.





యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని పిఆర్‌టి వీధికి చెందిన కావలి గౌరీ ప్రసాద్ అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న ప్రసాద్ కియాలో ఉద్యోగం చేసేవాడు. మంగళవారం మధ్యాహ్నం సూపర్ వాస్మాయిల్ తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అపస్మారక స్థితిలో పడి ఉన్న ప్రసాద్‌ను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికితరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

ప్రజాశక్తి - అగళి

మండల పరిధిలోని పి. బ్యాడిగెర గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప హెచ్ డి హళ్ళిలో గల వ్యవసాయ పొలంలో వేసుకున్న గుడిసె షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం అయింది. దీంతో గుడిసెలో ఉన్న డ్రిప్ పరికరాలు, పొలంలో పండించి నిల్వ ఉంచిన ఉల్లిగడ్డలు దగ్ధం అయ్యాయి. సుమారు 30 వేల రూపాయల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కర్నాటక మద్యం విక్రయిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు పుట్టపర్తి ఎక్సైజ్ సిఐ నాగరాజు తెలిపారు. పుట్టపర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం దాడులు నిర్వహించామన్నారు.నల్లమాడ మండల కేంద్రంలో డేగల జనార్ధన్ హోటల్‌లో ఉన్న 63 కర్నాటక మద్యం టెట్రా ప్యాకెట్లను సిజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు..

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - నల్లచెరువు


నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

మండల పరిధిలోని కే.పూలకుంట మాజీ సర్పంచి అక్బర్ తండ్రి మధార్ వలి (79) మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కదిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచి సమీవుల్లా, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచి రామిరెడ్డి, సూర్య శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

సంఘాల అభివృద్ధికి తోడ్పడాలి : ఎపిఎం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం తిమ్మమాంబ మహిళా సమాఖ్య యానిమేటర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం వెంకటనారాయణ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా పొందిన రుణాలను క్రమపద్ధతిలో చెల్లించుకుని సంఘాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. క్రమం తప్పకుండా నెలవారీ చెల్లింపులు ఉన్న సంఘాలకు రెట్టింపు మొత్తంలో రుణం పొందే అర్హత కల్పించబడుతుందన్నారు. నిలిచిపోయిన సంఘాల వివరాలు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసిలు రెడ్డప్ప, ఇస్మాయిల్, బాబాసాహెబ్, శ్రీనివాసరావు యానిమేటర్లు పాల్గొన్నారు.

బీసీలకు టిడిపి మండల కన్వీనర్ పదవి ఇవ్వండి

ప్రజాశక్తి తాడిమర్రి

టిడిపి తాడిమర్రి మండల కన్వీనర్ పదవి బిసిలకు కేటాయించాలని ఆపార్టీకి చెందిన పలువురు నాయకులు కోరుతున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కన్వీనర్ పదవి బిసిలకు కేటాయించలేదంటున్నారు. కనీసం ఇప్పుడైనా కన్వీనర్ పదవివని బిసిలకు కేటాయించాలని వారు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పున్ణవ్యవస్థీకరణ పక్రియతో పాటు రోజుకో ఆలోచనతో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు పక్రియ అందరిలో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని యుటిఎఫ్ నాయకులు జయచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ధర్మవరం యుటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహిస్తున్న సమావేశాల్లో సమస్యలు ప్రభుత్వం దృష్టికి తెచ్చినప్పటికీ అవి పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయుల్లో చెలరేగుతున్న ఆందోళన నేపథ్యంలో పాఠశాల పున్ణ వ్యవస్థీకరణ, ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల సమస్యలపై ప్రభుత్వం నుండి ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పోరాటం తప్ప మరొక మార్గం కన్పించలేదన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు విజయవాడ నగరంలో మంగళగిరి సమీపంలో ఆత్మకూరు విద్యా భవన్ వద్ద నిరసన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ నిరసన కార్యక్రమం ద్వారా అయినా ప్రభుత్వం స్పందించి వెంటనే ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అంబేద్కర్ భవన్‌ను అప్పగించాలని వినతి

ప్రజాశక్తి ముదిగుబ్బ

మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్ ను ఎస్టి ,ఎస్సి, బిసి, మైనార్టీ ,వర్గాలు చెందిన ప్రజలకు, సమావేశాలకు వినయోగించుకునేందుక అప్పగించాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక ఎంపీడీవో దివాకర్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటప్ప, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ

ప్రజాశక్తి -పుట్టపర్తి క్రైమ్

ఎస్సీ మహిళలకు హిందూపురంలో నేషనల్ అకాడమీ కన్ సెక్షన్ (ఎన్ ఎ సి), జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్ లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టైలరింగ్ శిక్షణకు ఆసక్తి గల ఎస్సీ మహిళలు 16 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగి ఉండాలన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు దరఖాస్తుకు జత చేయాలన్నారు. దరఖాస్తులతో హిందూపురం నందు ముక్కిడిపేటలో ఉన్న కేంద్రంలో సంప్రదించవచ్చు అన్నారు. మరిన్ని వివరాలకు 9052901657 కు ఫోన్ చేసి సంప్రదించవచ్చునని చెప్పారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని త్యాగరాజ నగర్ లో మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాల నిర్వహకులు నిర్వహిస్తున్న ఉచిత వేసవి బడి విద్యార్థులకు పుస్తకాలను ఎంపిడిఒ సరస్వతి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. శ్రీ వేంకటేశ్వర మిల్క్ డైరీ యాజమాన్యం కె.అరుణ, సి.వి.నాగరాజు సౌజన్యంతో కె.సాయికళ కె.మాళప్ప దంపతులు ఉచిత వేసవిబడి నిర్వహిస్తున్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం విజయవాడ రవి పబ్లికేషన్ అధినేత యం. ఆంజనేయ రావు అచ్చు పుస్తకాలను అందించారు. వాటిని స్థానిక ఎంపిడిఒ సరస్వతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కె.మాళప్ప, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ గురువు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, బి.యస్. కుమారి, మమత, శిరి, సాయి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించండి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం పరిధిలో గొల్లపల్లి రిజర్వాయర్ వాటర్ వర్క్స్‌లో విధులు నిర్వహిస్తున్న 25 మంది కార్మికులకు బకాయి ఉన్న 5 నెలల వేతనాన్ని వెంటనే చెల్లించాలని కార్మిక సంఘం నాయకులు కోరారు. బుధవారం ఈ విషయంపై ఎఐటియూసి నాయకులు కమిషనర్ ను కలిసి వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్ కుమార్, డీ. బాబు, మారుతి రెడ్డి, మంజు, ఉమేష్, రాజు, చంద్రశేఖర్, లోకేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.